# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 216
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
మే 27, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ప్రజా సంక్షేమానికి సీఎం పెద్దపీట

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి
- ఒక్క ఏడాదిలోనే రూ.800 కోట్ల పనులు ప్రారంభం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



# మావోయిస్టులను చంపి..సంబురాలా!

- టెర్రరిస్టులను పట్టుకోవడంలో బీజేపీ ప్రభుత్వం విఫలం
- బూటకపు ఎన్ కౌంటర్లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి
- 'కగార్'పై న్యాయ విచారణ జరుపాలి
- కుటుంబ సభ్యులకు మృతదేహాలను ఇచ్చేందుకు భయమెందుకు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, అందుకే దేశ పౌరులైన మావోయిస్టులను చంపి ప్రధాని నరేంద్ర మోడీ సంబురాలు చేసుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులతో చర్చలకు సిద్దపడిన కేంద్రం బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో సీపీఐ మహాసభల రెండో రోజు జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కేంద్రం చేస్తున్న ఎన్ కౌంటర్ లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. చత్తీస్ ఘడ్ లో జరిగింది బూటకపు ఎన్ కౌంటర్ అయినందునే మృతదేహాలను కూడా వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు భయపడ్డారని విమర్శించారు. మృత దేహాలను అప్పగించాలంటూ సుప్రీం కోర్టు ఆదేశించినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా వారి ఆనవాల్లు కనిపించకుండా చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ పై న్యాయ విచారణ జరుపించాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీకి టెర్రరిస్టులకంటే మావోయిస్టులే శత్రువులుగా కనిపిస్తున్నారా అంటూ ప్రశ్నించారు.

- వరంగల్ వాయిస్, హసన్ పర్తి

వివరాలు2లో..



2లో..

## ఆర్టీటీ నిర్వాహకులతో 'సిరికొండ' భేటీ

- సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు



8లో..

## భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



2లో..

## పెద్దాసుపత్రిలో.. పేరుకుపోయిన చెత్త

- దోమలు, ఈగలతో రోగులకు ఇబ్బందులు

# మావోయిస్టులను చంపి.. సంబురాలా!



- టెర్రరిస్టులను పట్టుకోవడంలో బీజేపీ ప్రభుత్వం విఫలం
- బూటకపు ఎన్ కౌంటర్లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి
- 'కగార్'పై న్యాయ విచారణ జరుపాలి
- కుటుంబ సభ్యులకు మృతదేహాలను ఇచ్చేందుకు భయమెందుకు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మోదీకి టెర్రరిస్టులకంటే కమ్యూనిస్టులంటేనే భయమెక్కువని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కమ్యూనిస్టులను తుడిచి పారేస్తామని మోదీ, అమిత్ షా ప్రగల్భాలు పలుకుతున్నారని, అలాంటి వారందరికీ హిట్లర్, ముస్సోలినీ గతే పడుతుందని హెచ్చరించారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. వారిని బతికించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందన్నారు. ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగు అయ్యాయని, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పాటుపడుతున్నందుకే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందన్నారు. సీపీఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావస్తుందన్నారు. వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### బూటకపు ఎన్ కౌంటర్లు..

కేంద్ర ప్రభుత్వం హత్యా కాండను ప్రోత్సహిస్తుందని సాంబశివరావు మండిపడ్డారు. ఇటీవలి కాలంలో వందలాది మావోయిస్టులను ఎన్ కౌంటర్ల పేరిట ఈ ప్రభుత్వం హత్య చేసిందన్నారు. బూటకపు ఎన్ కౌంటర్లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. టెర్రరిస్టులను పట్టుకోవడంలో విఫలమైన ప్రభుత్వం మావోయిస్టులను చంపి సంబురాలు చేసుకొంటున్నారని విమర్శించారు. అందుకే ఎన్ కౌంటర్ల తరువాత శవాలను ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం భయపడుతోందన్నారు.

### ఎదురుండదు..

దేశంలో ఉన్న అన్ని ఎర్రజెండా పార్టీలు ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందని కూనంనేని సాంబశివరావు అన్నారు. వంద సంవత్సరాలనుంచి ప్రజలకు అండగా నిలిచింది ఎర్ర జెండా పార్టీలే అని మరువరాదన్నారు. అందరూ ఏకమైతే ఎదుర్కొనే శక్తి ఈ బూర్జువా పార్టీలకు ఉండదన్నారు. రాష్ట్రంలో బీజేపీతో జత కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అది కేసీఆర్ కు కవిత రాసిన లేఖతో స్పష్టం అయిందన్నారు. దేశంలో అంబానీ, ఆదానీలకు ఊడిగం చేసే మోదీతో జతకట్టేందుకు కేసీఆర్ సిద్దపడడం సిగ్గుచేటన్నారు.

### ఏకం కావాలి..: తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

సీపీఐ మహాసభల సందర్భంగా గురువారం జరిగిన ప్రతినిధుల సభను ప్రారంభించిన అనంతరం ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తరువాత అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని మార్చివేసి మను వాదాన్ని తీసుకువచ్చేందకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అట్లాగే ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, వక్ఫ్ బిల్లు పేరుతో ముస్లింలను, క్రిష్టియన్ లను శత్రువులుగా చూస్తున్నారన్నారు. అందుకే దేశంలో అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో తలసరి ఆదాయం పెరిగిందని, ప్రపంచంలో మన దేశం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. దొంగ లెక్కలు, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశంలో పేదల సంపద రెట్టింపు కాలేదని, కేవలం అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ శక్తుల ఆదాయమే పెరిగిందన్నారు.

### హామీలు ఏమాయే..?

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ ను రాష్ట్ర రెండో రాజధానిగా ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ రావాలని, సాఫ్ట్ వేర్ కంపెనీలు రావాలని, స్థానికులకు ఉద్యోగాలు రావాలన్నారు. వీటి సాధనతోపాటు ప్రజాసమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన సీపీఐని బలోపేతం చేసి ఉద్యమాలు నిర్మించాలని కోరారు.

మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ హసన్ పర్తి మండలంలో అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. మండలంలో ఎందరో కమ్యూనిస్టు వీరులు ప్రజల కోసం పోరాడి అమరులయ్యారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగించారు. తొలుత సీపీఐ జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి ఎగురవేశారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా మంచాల రమాదేవి, బత్తిని సదానందం, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, ఉట్కూరి ప్రణీత్ గౌడ్, వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్ వ్యవహరించగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా తదితరులు పాల్గొన్నారు.










# ఆర్డీటీ నిర్వాహకులతో 'సిరికొండ' భేటీ

**సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకులు దివంగత విన్సెంట్ ఫెర్రర్ కుటుంబ సభ్యులను శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు మంచు ఫెర్రర్ తో భేటీ అయ్యారు. సుమారు 70 సంవత్సరాల క్రితం స్పెయిన్ దేశం నుంచి వచ్చి ఆర్డీటీ స్వచంద సేవా సంస్థను స్థాపించి రాయలసీమ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు, విద్య, వైద్య, ఉపాధి కల్పనకు విశేష కృషి చేస్తూ, నిరుపేదలకు లక్ష నివాస గృహాలను నిర్మించిన దివంగత విన్సెంట్ ఫెర్రర్ కుటుంబ సభ్యులను శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను శాసన సభ స్పీకర్ గా ఉన్న సమయంలో తన విజ్ఞప్తి మేరకు సుదూర ప్రాంతం భూపాలపల్లిలో ఆర్డీటీ సేవలను ప్రారంభించి, కొనసాగిస్తూ, విస్తృత పరుస్తున్న ఆ సంస్థలోని ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. విన్సెంట్ ఫెర్రర్ సేవా వారసత్వాన్ని కొనసాగిస్తున్న మంచు ఫెర్రర్, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దాసుపత్రిలో.. పేరుకుపోయిన చెత్త

- దోమలు, ఈగలతో రోగులకు ఇబ్బందులు




**వరంగల్ వాయిస్, రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. నేను రాను బిడ్డో సర్కారు దావఖానకు అంటున్నారు. ఇందుకు కారణం ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రత తాండవిస్తోంది. దుర్గంధంతో ముక్కు పుటాలు అదురుతున్నాయి. దోమలు, ఈగలతో ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా రోగాల బారిన పడిన వారు ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటారు. కాని ఇక్కడ మాత్రం అందుకు విరుద్దంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్నవారు ఆస్పత్రికి పోతే ఖచ్చితంగా బెడ్ ఎక్కాల్సిందే అన్నట్లుగా ఉంది. ఆసుపత్రి పరిసరాల్లో నీరు నిలిచి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఆసుపత్రిలోని ఓపీ, పిల్లల వార్డు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు మురిగిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో చిన్నపిల్లలకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సూపరింటెండెంట్ కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. రాత్రి సమయంలో విషపురుగుల బారిన పడే అవకాశం ఉందంటూ రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కరీమాబాద్‌లో సీపీఎం ఇంటింటి సర్వే

◆ స్థానిక సమస్యలపై ప్రజల వినతులు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** సీపీఎం పార్టీ కరీమాబాద్ ఏరియా ఆధ్వర్యంలో 32వ డివిజన్ పరిధిలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామన్నపేట కరీమాబాద్ ఏరియా కార్యదర్శి సింగారపు బాబు పాల్గొన్నారు. సర్వేలో భాగంగా జ్యోతి కాలనీలోని ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. మోరీ నీళ్లు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి, వీధిలైట్లు లేవు, రోడ్లు లేవు, రాత్రివేళ ప్రజలు పడిపోతున్నారు. దోమల సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీ చెత్త బండి రాకపోవడం, మోరీలు నెలల తరబడి శుభ్రం చేయకపోవడం వంటివి కాలనీవాసులు తెలిపారు. ఇలాగే బీర్నగుంటలో కూడా డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయి. చెత్త బండి రాకపోవడం వల్ల అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం అందించాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. అదే విధంగా, బీరన్నకుంటలో ఉన్న 1000 గజాల ఖాళీ స్థలాన్ని ప్రజలు ఫంక్షన్ హాల్‌గా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఇండ్లు కట్టించాలనే డిమాండ్‌ను కూడా సీపీఎం వేశారు.ఉర్సుగుట్ట బండ కార్మికుల విషయానికి వస్తే, అక్కడ 50 సంవత్సరాలుగా సుమారు 150 కుటుంబాలు బండలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ కార్మికులకు పక్క ఇళ్లను కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు గున్నాల ప్రభాకర్, మూడేడ్ల ఉపేందర్, అప్పాజీ వాణి, బోరగాని రమ్య, గన్నబోయిన వాణి, మాదాసు దివ్య, కోరే విజయ, బోరగాని రజిత, అప్పాజీ తేజ, ఎండీ మాసుబీ కాళీమాత తదితరులు పాల్గొన్నారు.

# మనోహర్ ను పరామర్శించిన నాగుర్ల



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని సదాశివ ఫెర్టిలైజర్స్ ప్రోప్రైటర్ మనోహర్ అనారోగ్యంతో పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలో విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ అండ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందే వెంకన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ..

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్క పల్లి గ్రామానికి చెందిన ఆమదాపురం శంకర్రావు అకాల మరణం చెందగా విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించి, బాధితుడి కుమారులు రాజు, శ్రీనివాస్, శ్రీధర్ వారి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోటె చిరంజీవి, రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, మాజీ ఉపసర్పంచ్ ధర్మారావు, నాయకులు కోడె పాక అన్న మొగిలి, కోడెపాక సారయ్య, ఐలయ్య, జూపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పండిట్ జవహర్ లాల్ నెహ్రూకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచన మేరకు మంగళవారం జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జనగామ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గంగం నర్సిరెడ్డి, జనగామ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలత, మహమ్మద్ జోయల్ సుల్తానా, జనగామ మండల ప్రధాన కార్యదర్శి గాదె అనిల్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ సలీం, వికలాంగుల సంఘం నాయకులు మేకల సమ్మయ్య, జనగామ పట్టణం జనగామ పట్టణంలోని వివిధ వార్డు అధ్యక్షులు మచ్చ ప్రవీణ్, ఉప్పు ఉపేందర్, ఆరెళ్ల విజయకుమార్, కడారు ప్రవీణ్ కుమార్, మిద్దెపాక స్టాలిన్, గాదెపాక ప్రసాద్, మహమ్మద్ ఆజాం, మల్లోజు గిరిబాబు, మహమ్మద్ కమాలుద్దీన్, నోముల సోమయ్య, మంతపురి ప్రకాష్, జనగామ మండల నాయకులు బక్క శ్రీనివాస్, జనగాం పట్టణ నాయకులు మోర్తాల ప్రభాకర్, నోముల రాజు, బైరగోని రఘు, జిల్లెల్ల విక్రం, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గణపాక సుధాకర్ కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, ములుగు:** ప్రతి ఏడాది అంబేద్కర్ జయంతి సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల సేవలో నిమగ్నమైన విశిష్టులైన వ్యక్తులను గుర్తించి "దళిత రత్న అవార్డు"ను ప్రదానం చేస్తుంది. ఈ ఏడాది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు గణపాక సుధాకర్‌కు లభించడం గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా మంగళవారం, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో గణపాక సుధాకర్‌కు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంలో పైడాకుల అశోక్ మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం సుధాకర్ చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డు ద్వారా ఆయన సేవలకు గౌరవం ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అలాగే, "సుధాకర్ అన్న మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకొని, అనేక పురస్కారాలను అందుకోవాలని మనసారా కోరుకుంటున్నాను. ఆయన అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుండెబోయిన నాగలక్ష్మి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, యువజన నాయకుడు గణపాక భరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అచ్చ సుదర్శన్ కు అవార్డు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులులో పని చేస్తున్న అచ్చ సుదర్శన్ సర్దార్ పటేల్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. సర్దార్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని ఉంజా పట్టణంలో ఈ అవార్డు కార్యక్రమం జూన్ 5న అందజేయడం జరుగుతుందని ఆ సంస్థ అధ్యక్షుడు శైలేష్ కుమార్ తెలియజేశారు. ఈ అవార్డుకు భారతదేశంలోని 13 రాష్ట్రాలలో పనిచేస్తున్న ఇన్నోవేటివ్ టీచర్స్ ను తెలుసుకొని తెలంగాణ నుంచి అచ్చ సుదర్శన్ ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అచ్చ సుదర్శన్ పాఠశాలలో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తూ, విద్యార్థులను తీర్చి దిద్దుతున్న క్రమాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని ఈ అవార్డుకు అచ్చ సుదర్శన్ ను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.

# టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నాయిని రాజేందర్ రెడ్డిని నియమించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 40 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పాటు సేవలందించి కాంగ్రెస్ పార్టీకి, కార్యకర్తలకు "పెద్దన్న" పాత్ర పోషిస్తున్న హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డిని టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా నియమించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నట్లు టీపీసీసీ కల్లుగీత డిపార్ట్ మెంట్ సెక్రటరీ రావుల వెంకట రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, సుదీర్ఘ రాజకీయ అనుభవం, నిఖార్సైన కాంగ్రెస్ వాదిగా గుర్తింపు, నీతి, నిజాయితీకి మారుపేరుగా వెలుగొందుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ప్రజల్లో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని అన్ని అర్హతలు ఉన్న నాయిని రాజేందర్ రెడ్డికి అవకాశం కల్పించాలన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవం కాంగ్రెస్ పార్టీకి ఎంతో దోహదపడుతుందని ఆయన నియామకం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి నాయిని రాజేందర్ రెడ్డి చేసిన సేవలను గుర్తించి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అవకాశం కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పక్షాన సీఎం రేవంత్ రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కోరుతున్నట్లు వెంకట రమేష్ గౌడ్ తెలిపారు.

# చేనేత కార్మికులు సంఘటితంగా పోరాటానికి సిద్ధం కావాలి

◆ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి బయటపడేయడం కోసం, కార్మికుల సమస్యల పరిష్కారానికి నేతన్నలందరినీ సంఘటిత చేసి సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చేనేత కార్మిక సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి చేపూరి ధనుంజయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ, గత 11 ఏళ్ల మోదీ పాలనలో చేనేత కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని, బ్రతుకులు పెనం మీద నుండి పొయ్యి మీద పడినట్లయ్యాయన్నారు. చేనేతపై విధించిన జీఎస్టీ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికోసం తగిన నిధులు కేటాయించి, స్థిరమైన ఉపాధి కల్పించి, గిట్టుబాటు కూలీ లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, సహకార రుణాలను మాఫీ చేయాలని, ప్రాథమిక చేనేత సహకార సంఘాలు, టెస్కోకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జల్ది రాములు, కోట రాజయ్య, పెండెం సర్వేశం, లింగబత్తిని రామకృష్ణ, ఎస్. సత్తయ్య, ఎం. కృష్ణమూర్తి, సీహెచ్. వెంకటేశ్వర్లు, కె. సంపత్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన పెండెం సర్వేశంను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

# గుండేటికి యునైటెడ్ కార్పొరేషన్ ప్రతినిధుల సంఘీభావం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గకు చెందిన యునైటెడ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుడు గుండేటి నరేందర్ కుమార్ నివాసానికి కార్పొరేషన్ ప్రతినిధులు వెళ్లి పరామర్శించారు. ఇటీవల చోటుచేసుకున్న సంఘటనపై ఆయన అభిప్రాయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ "ఒక్కటిగా ఉండి, సమాజంలో న్యాయం సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. మా సంస్థ ఎల్లప్పుడూ బాధ్యతతో ముందుంటుంది. న్యాయమే గెలుస్తుందని మా విశ్వాసం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ గౌరవ అధ్యక్షుడు బయ్య స్వామి, గౌరవ సలహాదారుడు ధూపం సంపత్, కోశాధికారి రామ రమేష్, ఉపాధ్యక్షులు వంగరి ప్రకాష్, గజ్జల రామ్ కిషన్ పాల్గొన్నారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులు వెలిశాల బాబు, లకుం భాస్కర్, శ్రీరంగం లక్ష్మణ్, అరికాల రాజు, గుర్రపు సత్యనారాయణ, దాసరి ప్రకాష్, సిలువేరు థామస్, తుమ్మ వేణుబాబు, వాన్ కార్ మహేందర్, భీమనాదుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఐక్యతను ప్రతిబింబిస్తూ, భవిష్యత్తులో సమాజానికి న్యాయం కల్పించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని సంకల్పించారు.

# శిక్షణలో సర్వే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లైసెన్స్ సర్వేయర్ శిక్షణా కార్యక్రమంలో సర్వేకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం (టీడీసీ)లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో సర్వే నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై నిర్వహిస్తున్న బోధనా తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బోధనా అంశాలను కలెక్టర్ విన్నారు. శిక్షణార్థులతో కలెక్టర్ సంభాషించారు. శిక్షణ కార్యక్రమం గురించి శిక్షణార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్ ను కలెక్టర్ చేతుల మీదుగా అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజుల పాటు నిర్వహించే శిక్షణ కాలంలో సర్వేకు సంబంధించిన అన్ని అంశాలపై పట్టు సాధించే విధంగా శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అంశాలపై శిక్షణార్థులకు 50 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి భూవివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. భూ వివాదాలు లేకుండా ఉండాలంటే ఫీల్డ్ సర్వే చేయడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్షను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి భూభారతి సర్వే చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి సర్వే రిపోర్ట్ ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. శిక్షణార్థుల హాజరు అన్ని రోజుల పాటు అటెండెన్స్ పక్కాగా తీసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే వాటిని గురించి నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వే సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకునే విధంగా తరగతులను మిస్ చేసుకోవద్దన్నారు. శిక్షణ తరగతులను సరిగ్గా వింటేనే ప్రాక్టికల్ గా చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అందరం కలిసి యూనివర్సిటీని ముందుకు తీసుకెళదాం

● వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** "విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరం. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి ముందుకు సాగాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సెనెట్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ యూనివర్సిటీలో అకాడమిక్ వాతావరణాన్ని బలోపేతం చేయడం కోసం వివిధ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు, అవగాహన సదస్సులు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అల్మనాక్ ప్రకారం కొద్దిపాటి మార్పులతో తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల కంటే ముందుగా డిగ్రీ, పీజీ పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రాంగణ నియామకాలు చేపట్టడమే కాకుండా, ముఖ్యమంత్రి సహకారంతో విశ్వవిద్యాలయ బడ్జెట్‌ను రూ.98 కోట్ల నుంచి రూ.144 కోట్లకు పెంచామని తెలిపారు. అదనంగా రూ.50 కోట్ల అభివృద్ధి గ్రాంట్‌ను పొందామని, దీనిని మౌలిక వసతులు, అకాడమిక్ అభివృద్ధి కోసం వినియోగిస్తామని చెప్పారు. రాష్ట్రీయ ఉన్నత విద్యాభివృద్ధి మిషన్ (రుసా 2.0) నిధులు యూనివర్సిటీకి మంజూరైన నేపథ్యంలో, కే-హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనిని "సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ & ఇన్నోవేషన్ సెల్"గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 5 రీసెర్చ్ సెంటర్లు, 65 మంది ప్రాజెక్ట్ ఫెలోషిప్‌లను ప్రారంభించనున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల్లో AICTE మార్గదర్శకత్వంలో స్కిల్ బేస్డ్ కోర్సులు ప్రారంభించనున్నామని తెలిపారు. జీవన నైపుణ్యాలు, భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సెల్‌లు ఏర్పాటు చేయనున్నారు.

### గోల్డెన్ జూబిలీ, శతాబ్ది వేడుకలు..

ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీ నుంచి కాకతీయ విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబిలీ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు "తెలంగాణ సైన్స్ కాంగ్రెస్" నిర్వహించనున్నట్లు తెలిపారు. గోల్డెన్ జూబిలీ గుర్తుగా "అకాడమిక్ బిల్డింగ్", అలాగే యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ శతాబ్దోత్సవాన్ని పురస్కరించుకుని "సెంటినరీ బిల్డింగ్" మరియు "అకాడమిక్ బ్లాక్" నిర్మాణానికి ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి పంపినట్లు వెల్లడించారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల కోసం కొత్త అకాడమిక్ బ్లాక్, హాస్టల్, కామన్ మెస్, అలాగే గిరిజన విద్యార్థుల కోసం బాలుర, బాలికల వసతి గృహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో ఒక పురుష వైద్యుడు, ఒక మహిళా వైద్యుడిని నియమించినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణ భద్రత కోసం ప్రహరి గోడ నిర్మాణానికి సంబంధించిన నివేదికలను స్వీకరించామని, పాలక మండలి ఆమోదం అనంతరం పనులు ప్రారంభిస్తామని చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి నాస్కామ్ (NASSCOM), ITES సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అలాగే, పి.వి. విజ్ఞాన పీఠం ద్వారా సామాజిక, ఆర్థిక పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. జూలై 7, 2025న జరిగే 23వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 573 గోల్డ్ మెడల్స్, 546 పీహెచ్‌డీ డిగ్రీలు అందించనున్నామని, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు.

# దామెర పీహెచ్‌సీలో సిబ్బంది కొరత



◆ సమస్య పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓకు బీజేపీ వినతి

**వరంగల్ వాయిస్, దామెర :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో వైద్య సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు తగిన ఆరోగ్య సేవలు అందడం కష్టంగా మారిన నేపథ్యంలో, బీజేపీ నేతలు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ అప్పయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురుజాల శ్రీరామ్ రెడ్డి, బత్తుల సుమంత్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పీహెచ్ సీలో సిబ్బంది కొరత వల్ల గ్రామ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతున్నారని, దీని వల్ల రైతులు, కూలీలు అధిక ఖర్చుతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పీహెచ్ సీలో పని చేస్తున్న సిబ్బందిలో చాలా మంది డిప్యుటేషన్‌పై ఉన్నారు. డా.మంజుల (మండల వైద్యాధికారి), లీల (పబ్లిక్ హెల్త్ నర్స్), కరుణ రాణి (స్టాఫ్ నర్స్), శరత్ బాబు (ఫార్మసిస్ట్), సుప్రజ (ఎల్డీ కంప్యూటర్ ఆపరేటర్), వెంకటేశ్వర్లు (ఎంపీహెచ్‌డబ్ల్యూ –మేల్)తో పాటు ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు. 10 ఏఎన్‌ఎంలకు అవసరమైన పోస్టుల్లో కేవలం 5 మంది మాత్రమే విధుల్లో ఉండగా, అందులో ఇద్దరు డిప్యుటేషన్‌పై ఉన్నారు. మిగిలిన మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య రక్షణకు మెరుగైన ఆధారంగా ఉండాలి. ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ఇది రాజకీయాల విషయం కాదని, ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశమని అన్నారు. ఈ వినతిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సానుకూలంగా స్వీకరించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన సిబ్బంది నియామకానికి ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు.

# 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ – 2025' బ్రోచర్ విడుదల



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంవత్సరం (50వ వసంతం)ను పురస్కరించుకుని, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సహకారంతో "తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ – 2025"ను ఆగస్టు 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ మహాసభలకు సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, తెలంగాణ సైన్స్ అకాడమీ అధ్యక్షుడు ఆచార్య సీ.హెచ్ మోహన్ రావు, సెక్రటరీ ఆచార్య సత్యనారాయణ కలిసి, మీడియా సమక్షంలో విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో విడుదల చేశారు. ఈ సైన్స్ కాంగ్రెస్‌కు విశ్వవిద్యాలయం తరఫున ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశంలో రెండు ప్లీనరీ సెషన్లు, నాలుగు థీమెటిక్ సమాంతర సెషన్లు, రెండు సబ్–థీమ్ సెషన్లు, నాలుగు స్పెషల్ థీమ్ సెషన్లు, నాలుగు ఓరల్ ప్రెజెంటేషన్ సెషన్లు, రెండు పోస్టర్ సెషన్లు, ప్యానల్ డిస్కషన్లు నిర్వహించబడతాయని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న ఇది రెండవ సైన్స్ కాంగ్రెస్ అని, మొట్టమొదటిది 2018లో వరంగల్ నిట్ లో జరిగినదని, ఈసారి సుమారు 1000 మంది ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సెక్రటరీ ఆచార్య సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆచార్య సంజీవా రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఆచార్య వి.రవీందర్, ఖజానాదారు ఆచార్య ఎస్.ఎం.రెడ్డి తదితర అకాడమీ కార్యవర్గ సభ్యులు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, ఆచార్య ఎన్. ప్రసాద్, ఆచార్య టి.మనోహర్, ఆచార్య రాజేందర్ కట్ల, ఆచార్య హనుమంత్, ఆచార్య బి.సురేష్ లాల్, ఆచార్య పి.వరలక్ష్మి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ విగ్రహాన్ని మహంకాళి విగ్రహంగా తప్పుడు ప్రచారం

- మహంకాళి గుడిని రేణుక ఎల్లమ్మ గుడిగా నామకరణం చేయాలి
- శిల్పులు నిర్ధారణ చేసే వరకు గుడి నిర్మాణం ఆపాలి
- గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్





**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మండల పరిధిలోని 66వ డివిజన్‌లో గాంధీ చౌక్ సెంటర్ సమీపంలోని ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఒక పురాతన గుడి శిథిలాలను పునర్నిర్మిస్తున్న సమయంలో, గుడిలో ఉన్న దేవత విగ్రహం గురించి వివాదం నెలకొంది. ఆ విగ్రహం రేణుక ఎల్లమ్మ దేవతదే అని స్పష్టమైన లక్షణాలు ఉన్నప్పటికీ, గ్రామంలోని కొంతమంది పెద్దలు అదే విగ్రహాన్ని మహంకాళి విగ్రహమని ప్రకటించి, గుడికి 'మహంకాళి గుడి'గా నామకరణం చేస్తూ నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్ మంగళవారం అక్కడికి చేరుకొని గుడిని సందర్శించి, విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహంలో అమ్మవారి తలపై నాగుపాము పడగ, చేతిలో డమరుకం, కుంకుమ భరణి, కత్తి, శూలం వంటివి స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇవన్నీ రేణుక ఎల్లమ్మ దేవత లక్షణాలని స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పెద్దలు, స్థానిక కార్పొరేటర్ గౌడ కులస్థుల కులదైవాన్ని తప్పుగా చూపిస్తూ గౌడ సమాజాన్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గౌడ కులస్థుల విశ్వాసానికి వ్యతిరేకంగా ఇది జరుగుతుండడం బాధాకరమని తెలిపారు. విగ్రహం ఖచ్చితంగా ఏ దేవతదో నిర్ధారణ చేయాల్సిన బాధ్యత పురావస్తుశాఖ, శిల్పకళా నిపుణులదేనని, వారి నివేదిక వచ్చే వరకు గుడి నిర్మాణాన్ని తాత్కాలికంగా ఆపాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర, జిల్లా గౌడ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని, చట్టపరంగా కూడా పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జనగాం శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల లక్ష్మణ్ గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంతుల రమేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పులి మోహన్ గౌడ్, వల్లాల జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జయరాములుకి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, జనగాం:** కంచనపల్లి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జయరాములుని మాజీ పీఏసీఎస్, డీసీసీబీ వైస్ చైర్మన్ రాపోలు పుల్లయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పీఏసీఎస్ బ్యాంకు అనేది రైతులదే. వారు ఒక్కొక్క రూపాయితో తమ కష్టార్జితాన్ని పెట్టుబడి పెట్టి స్థాపించిన ఈ సంస్థలో నేడు అనేక అవినీతి చర్యలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు గత వైభవాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ బ్యాంకు రైతులకు లోన్లు, ఎరువులు, విత్తనాలు, రేషన్ షాపు సేవలు అందిస్తూ ముందుకు సాగింది. కానీ 2018 వరకు అన్ని విధాలుగా సేవలందించిన ఈ బ్యాంకు, ప్రస్తుతం తీవ్ర అవినీతి, విఫల పరిపాలన కారణంగా శిధిల దశలోకి చేరిందని చెప్పారు. అలాగే, నూతన కార్యాలయం ఏర్పాటు చేసి నగదు సేవలు మొదలుపెట్టాలని, రేషన్ షాపును పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, ఈ బ్యాంకు తిరిగి విశ్వాసాన్ని పొందేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయకత్వం, సహకారంతో జయరాములు అనుభవశాలి నాయకుడిగా బ్యాంకును మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లగలరని పుల్లయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోలు రామ్మూర్తి, గ్రామ మాజీ అధ్యక్షులు ఓరుగంటి మనోహర్, ముక్కెర ఐలయ్య, మాజీ ఎంపిటిసి కారంపూరి వెంకట నర్సయ్య, మేకల యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** పెండింగ్ బిల్లుల విషయంలో నిరసనకు సిద్ధమవుతున్న మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసిన ఘటన ఆత్మకూరు మండలంలో చోటు చేసుకుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించిన మాజీ సర్పంచులు ప్రజా భవనాన్ని ముట్టడించనున్నట్టు ప్రకటించడంతో, పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో, పెద్దాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ సావురే కమల రాజేశ్వరరావు, నీరుకుల మాజీ సర్పంచ్ అర్షం బలరాం, లింగమడుగుపల్లి మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాజేశ్వరి రాజును పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమపై కక్షగట్టి పెండింగ్ బిల్లులను చెల్లించకుండా వేధిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ కంటే వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, నిరసన తెలిపే హక్కును హరిస్తోందని వారు మండిపడ్డారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో గడువు కొనసాగితే, తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా ఆయుష్ ఇంచార్జి, తొర్రూరు ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ పి.కిరణ్ కుమార్ తెలియజేసినట్లుగా, జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి యోగా దినోత్సవానికి సంబంధించిన కార్యాచరణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమం భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. తొర్రూరు పట్టణంలోని యతిరాజారావు పార్క్ లో యోగా అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఇందులో సాధారణ యోగ ప్రణాళికకు అనుగుణంగా పలు యోగాసనాలు పాల్గొన్న వారందరితో అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా, యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ, జీవన శైలిలో మార్పులు, కొంతమంది తరచూ ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు ఉపయోగపడే యోగాసనాల ప్రాముఖ్యతపై వివరించబడింది. ఆయా ఆసనాలు ఎలా చేయాలో కూడా స్పష్టంగా తెలియజేశారు. ఈ యోగా ప్రచార కార్యక్రమాలు మంగళవారం నుంచి జూన్ 21 వరకు



ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిర్వహించబడతాయని డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ప్రతి రోజు ఒక్కో ప్రత్యేక కార్యక్రమం ఉండేలా ప్రణాళిక రూపొందించామని, ఇది రాష్ట్రవ్యాప్తంగా కూడా కొనసాగుతుందని తెలిపారు. ఇటువంటి ప్రజావేధన కార్యక్రమాలకు పత్రికలు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలలో మరింత అవగాహన పెంచేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి

### ఏఐకేఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి




**వరంగల్ వాయిస్, వరంగల్:** ఎంసీపీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల సందర్భంగా మే 26,27,28 తేదీల్లో వరంగల్‌లోని పోగుల ఆగయ్య నగర్ (సాయి కన్వెన్షన్ హాల్, శివనగర్)లో సమావేశాలు జరుగుతున్నాయి. మహాసభల రెండో రోజు భాగంగా, జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి నేతృత్వంలో రైతు ర్యాలీ నిర్వహించబడింది. పోచమ్మ మైదానంలో జెండా ఊపి ఈ భారీ ర్యాలీకి ఆయన ప్రారంభం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, రైతులకు ఇచ్చే రుణమాఫీలను రద్దు చేస్తూ కుట్రలు చేస్తోందని ఆయన విమర్శించారు. "జై కిసాన్" అనే నినాదాలు పెట్టుకుంటూనే దేశంలో ఏడు లక్షల పైగా రైతుల ఆత్మహత్యలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమయ్యాయని ఆరోపించారు. రైతే రాజ్యం వెనకున్న శక్తి అని పెద్దగా మాట్లాడే నాయకులు, రైతుల చావులపై రాజకీయ లాభాల కోసం ప్రయత్నించడమే తప్ప, వారి కుటుంబాలకు ఎలాంటి మద్దతు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ఢిల్లీ వరకు వెళ్లి 13 నెలల పాటు పోరాటం చేసిన రైతులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలకే మద్దతు ఇస్తూ రైతులను విస్మరించడాన్ని తీవ్రంగా ఖండించారు. అన్ని వర్గాల ప్రజలు ఈ విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రైతుల పంటలకు భరోసా కల్పించే చట్టాలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం బాధాకరమని తెలిపారు. ఇంకా, రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం, ఎకరానికి రూ.15,000 పెట్టుబడి సహాయాన్ని ఇవ్వకపోవడం, వృద్ధులకు పూర్తిస్థాయిలో పెన్షన్ అందించకపోవడం సిగ్గుచేటన్నారు. హామీలతో ఓట్లు పొందిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల్ని విస్మరించడం వల్ల ప్రజా వ్యతిరేక ముద్ర పడుతోందన్నారు. పంచాయతీ ఎన్నికలు కూడా జరపలేని స్థితికి ప్రభుత్వం దారి తీసిందని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొంటూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాటిని సరిచేయకుండా మాటలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ రైతు ర్యాలీలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చంద్రరావు, రైతు నాయకులు చంద్రశేఖర్, సింగటి సాంబయ్య, పానుగంటి నరసయ్య, బలుసుకురి నరసయ్య, బాసిపాక రమేష్, కుశ సంపత్, వీరమల్లు రాజు, మాదం తిరుపతి, తాటికొండ రవి, మాలోతు రాజేష్ నాయక్, రాకేష్, సూరి శేఖర్ లు పాల్గొన్నారు. మొత్తం దాదాపు 1000 మంది రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## సహారా యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక





**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చింతనెక్కొండలో మంగళవారం సహార యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షులుగా ముద్రబోయిన వాసు, అధ్యక్షులుగా బత్తిని దేవేందర్, ఉపాధ్యక్షులుగా వీరారపు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోనాల సాంబయ్య, కోశాధికారిగా పూజారి రాజు (డీలర్), ఆడిట్ కమిటీ సభ్యులుగా నల్లపు నరేందర్, మామిండ్ల శ్రీనివాస్, బొల్లం రవి, ముఖ్య సలహాదారులుగా తౌడోజు రమేష్, సూరినేని లక్ష్మణ్ రావు, మామిండ్ల అశోక్ ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సహార్ యూత్ అసోసియేషన్ పటిష్టతకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని చెప్పారు.

# ఆత్మీయం.. అద్భుతం..



- ఘనంగా జడ్పీహెచ్ఎస్ కొప్పుల 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ స్టూడెంట్స్ గెట్ టు గెదర్
- మధుర స్మృతులను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు
- పరకాలలో ఆత్మీయ సమ్మేళనం
- నాటి గురువులకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఆత్మీయ పలకరింపులు.. ఆలింగనాలు..ఎన్నో జ్ఞాపకాలు.. చిన్నప్పటి మధుర స్మృతులను నె మరువేసుకున్నారు పూర్వ విద్యార్థులు. శాయంపేట మండలం కొప్పుల గ్రామంలోని శ్రీ విద్యానికేతన్ ప్రాథమిక పా ఠశాల, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఒకటో త రగతి నుంచి టెన్త్ వరకు చదువుకున్న వారంతా హనుమకొండ జిల్లా పరకాలలోని లలితా కన్వెన్షన్ వేదికగా ఆ త్మీయ వేడుకలో కలుసుకున్నారు. 20...25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార తదితర రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా చిన్నప్పటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పో యింది. రెండు దశాబ్దాల క్రితం తమ జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అనుభవాలనూ, అనుభూతులనూ కలబోసుకున్నారు. చిలిపి పనులు, అప్పటి ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని, ఆనాటి ముచ్చట్లను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని, వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. కాగా, కార్యక్రమానికి హాజరైన గురువులపై పూలు చల్లుతూ ఆప్యాయంగా ఆహ్వానం పలికారు. నాడు తమకు చదువు చెప్పిన గురువులకు జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. నేడు వారు తమకు చెప్పిన విద్యాబుద్ధుల వల్లే తామంతా ప్రస్తుతం ఇలా ఒక్కో రంగంలో రాణిస్తున్నామని, మీ ఆశీర్వాదాలు, తమ తల్లిదండ్రుల ఆశీస్సుల ఉంటే మరింత రాణించి ఊరికి, మంచి పేరు తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభినాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. అంతేకాకుండా ఆఫీస్ అటెండర్ గా పనిచేసిన జహీర్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం ఆ కుటుంబానికి దాదాపు రూ.15వేల ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు సత్యనారాయణ, రవీందర్ వినయ్ కుమార్, వాసుదేవ్, వేములపల్లి మొగిలి ఆడెపు ఆనంద్, మంద కొమురయ్య, కాడపాక సామెల్, అడిదెల మోహన్ రెడ్డి, కల్లెపు సమ్మయ్య, కొండేటి శ్రీనాథ్ రెడ్డి, తడుక భిక్షపతి, దాసరి ధనుంజయ, తోట కుమారస్వామి, అలువాల రాములు, పల్లెబోయిన రవి, కర్రు రమేష్, ఆకుతోట శంకర్, బొట్ల సాంబమూర్తి, బొట్ల జంపయ్య తోపాటు అటెండర్ జహీర్, తదితరులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. డీజె పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేశారు. రోజంతా ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొలిపాక సూర్యప్రకాశ్, తోకల సమ్మిరెడ్డి, ఆకుతోట రాజేందర్, వేములపల్లి రమ, ముప్పు స్వప్న తోపాటు పలువురు పూర్వ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర ముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన లైసెన్స్డ్ సర్వేయర్ల ధ్రువపత్రాల పరిశీలన, సామగ్రి పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు లైసెన్స్డ్ సర్వేయర్లకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వివిధ సందర్భాలలో నిర్వహించే సర్వే సమయంలో సర్వేయర్ల పాత్ర మరువలేనిదన్నారు. భూములకు సంబంధించి సర్వేయర్లు వివిధ రకాల సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వే వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్యపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో అలాగే అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లది కీలక పాత్ర అని అన్నారు. అందువలన సర్వేయర్లు శిక్షణకు హాజరై జాగ్రత్తగా అన్ని అంశాలను క్షుణ్ణంగా విని అర్థం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లైసెన్స్డ్ సర్వేయర్లకు సర్వే సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ పాలనలో ప్రమాదంలో దేశ సార్వభౌమత్వం

- పహల్గాం ఘటనపై వాస్తవాలు వెల్లడించాలి
- మావోయిస్టులతో చర్చలకు కేంద్రం ఎందుకు ముందుకురావడం లేదు
- కగార్ ఆపరేషన్ ఆపాలి
- కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) –ఎంసీపీఐ(యు) పోలిట్‌బ్యూరో సమావేశం మే 27న వరంగల్‌లోని గ్రాండ్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశానికి పార్టీ రాజస్థాన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ మహేందర్ నేహా అధ్యక్షత వహించగా, పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులు, ఇండియా–పాక్ పరస్పర కాల్పుల్లో మరణించిన పౌరులు, అలాగే సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) పోలిట్‌బ్యూరో సభ్యుడు సంజయ్ సింగ్వి మృతి పట్ల రెండు నిమిషాల మౌనాన్ని పాటించారు. అంతర్జాతీయ, జాతీయ అంశాలపై మాట్లాడిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్, బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. అమెరికా విధించిన ఆంక్షలపై కేంద్రం మౌనం పాటించడం, వాటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోకపోవడం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. పహల్గాం ఘటన అనంతరం కేంద్రం 'ఆపరేషన్ సింధూర్' పేరిట దూకుడు ప్రదర్శించినప్పటికీ, అమెరికా జోక్యం వల్ల వెనక్కి తగ్గిన వ్యవహారాన్ని ఎత్తిచూపారు. ఇది దేశ సార్వభౌమత్వంపై విదేశీ జోక్యం ఎలా ప్రభావం చూపిస్తోందనడానికి నిదర్శనమన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం శాంతి మార్గాన్ని విస్మరిస్తూ దండకారణ్యం, మధ్య భారతంలోని ఆదివాసీ ప్రాంతాల్లో 'కగార్ ఆపరేషన్'పేరుతో దమన చర్యలు చేపడుతోందని ఆరోపించారు. ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ సహా 27 మందిని హత్య చేయడం, వారి శవాలను బంధువులకు అప్పగించకపోవడం ప్రజాస్వామ్య పరంగా ప్రశ్నార్థమన్నారు. తక్షణమే ఈ దమన విధానాలను ఆపి, మావోయిస్టులతో చర్చలు ప్రారంభించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శాంతి, ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రభుత్వంగా కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ప్రస్తుతం బీజేపీ పాలనలో ప్రజాస్వామిక హక్కులు ముట్టడి చేయబడుతున్నాయని, మను వాదం, కార్పొరేట్ ఫాసిజం బలపడుతున్నాయని విమర్శించారు. అన్ని ప్రభుత్వ యంత్రాంగాలను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామ్యవాద శక్తులన్నీ బూర్జువా దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, ఎంసీపీఐ(యు) తరపున అన్ని ప్రయత్నాలను సమన్వయంగా ముందుకు తీసుకెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పోలిట్‌బ్యూరో సభ్యులు కిరణ్ జిత్ సింగ్ షేఖాన్, గాదగోని రవి, అనుభవ్ దాస్ శాస్త్రి, వల్లెపు ఉపేందర్ రెడ్డి, కాటం నాగభూషణం పాల్గొన్నారు.



# పుష్ప పాత్రను మిస్ చేసుకున్నా..



నారా రోహిత్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు నారా రామమూర్తి నాయుడు కుమారుడైన రోహిత్ సినిమాల మీద ఆసక్తితో ఎప్పుడో బాణం అనే సినిమాతో హీరోగా లాంచ్ అయ్యాడు. ఆ తర్వాత చేసిన సోలో ఇలాంటి సినిమా ఆయనకు మంచి హిట్ వచ్చింది. ఆ తర్వాత చేస్తున్న సినిమాలన్నీ వైవిధ్యంగా ఉన్నా ఎందుకో హిట్స్ అందుకోలేకపోయాడు. అయితే ఆయన తాజాగా భైరవం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాలో ఆయన మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. మే 30వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో నారా రోహిత్ మీడియాతో ముచ్చటించాడు. ఈ సందర్భంగా అనేక విషయాలు పంచుకున్న ఆయన తాను పుష్ప లాంటి సినిమాను మిస్ చేసుకున్నట్లు– వెల్లడిరచాడు. తనను పుష్ప సినిమాలోని ఫహద్ ఫాజిల్ క్యారెక్టర్ కోసం ముందు అడిగారని, అయితే మాటలు జరుగుతున్న సమయంలోనే ఆ సినిమాను పాన్ ఇండియా సినిమాగా చేయాలని భావించి ఆ సమయంలో ఫహద్ ఫాజిల్‌ను సంప్రదించారని చెప్పుకొచ్చాడు. ఇక భైరవం సినిమా బాగా కుదిరిందని, తమిళంలో శశి కుమార్ చేసిన పాత్ర తాను ఇక్కడ పోషించానని చెప్పుకొచ్చాడు. కచ్చితంగా భైరవం హిట్ అవుతుందని నమ్మకం ఆయన వ్యక్తం చేశాడు. అలాగే తాను సుందరకాండ అనే సినిమాతో మరో నెల రోజుల్లో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు– వెల్లడిరచాడు.

# ఛాంబర్ ద్వారానే టిక్కెట్ల పెంపు అభ్యర్థనలు

- నా సినిమా అయినా సరే.. వ్యక్తిగతంగా రావద్దు
- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు



థియేటర్ల మూసివేత అంశంపై పెద్ద రగడ జరుగుతోంది. ఇప్పటికే ఈ అంశంపై పవన్ కల్యాణ్ సీరియస్ గా స్పందించారు. దానిపై ఇప్పటికే అల్లు అరవింద్, దిల్ రాజు కూడా తమకు సంబంధం లేదని క్లారిటీ– ఇచ్చుకున్నారు. పవన్ కల్యాణ్ కే మద్దతు పలికారు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్ మరోసారి ఘాటు–గా స్పందించారు. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ తాజాగా పవన్ కల్యాణ్ తో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కీలక విషయాలను చర్చించారు. అనంతరం పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు, వ్యాఖ్యలు చేశారు. ఇక నుంచి సినిమా టికెట్ల ధరల పెంపుకోసం వ్యక్తిగతం రావొద్దని తేల్చి చెప్పారు. 'నా సినిమా టికెట్ ధరల పెంపుకోసం అయినా సరే ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే రావాలి. ఇక నుంచి ఎవరూ వ్యక్తిగతంగా రావొద్దు. అలా వస్తేనే సినిమా ఇండస్ట్రీలో ఐక్యత పెరుగుతుంది. హరిహర వీరమల్లు సినిమాకు అయినా సరే నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే రావాలి. మండలి ద్వారానే వచ్చి అర్జీ పెట్టి సంప్రదింపులు జరపాలి. అంతే గానీ తనమన అనే బేధాలు పాటించొద్దు. ఇక నుంచి ఫిల్మ్ ఇండస్ట్రీలో మనకు అందరూ సమానమే. నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర మండలి ద్వారా వస్తేనే అందరికీ సమాన న్యాయం జరుగుతుంది. ఇందులో ఎలాంటి తారతమ్యాలు లేవు. అందరూ మనకు సమానమే. ఇప్పటి వరకు ఎవరికి ఎలాంటి బేధాలు మేము చూపించలేదు. కాబట్టి ప్రభుత్వంతో అందరూ అలాగే బిహేవ్ చేస్తే బెటర్. టికెట్ల ధరల పెంపుపై కూడా పునరాలోచనలు చేస్తాం. ఎలా పడితే అలా పెంచకుండా ఒక నిర్దిష్ట స్థాయిలోనే ధరలు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తాం అని పవన్ కల్యాణ్ తెలిపారు.

### పకడ్బందీగా సినిమా హాళ్ల నిర్వహణ


రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని... ఆ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.. సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను, తాజా పరిణామాలను ఉప ముఖ్యమంత్రికి రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.

# కన్నప్ప హార్డ్ డిస్క్ చోరీ



### అందులోనే ప్రభాస్ యాక్షన్ సీన్లు

మంచు విష్ణు హీరోగా తెరకెక్కుతున్న 'కన్నప్ప' సినిమాకు సంబంధించి ఓ కీలక పరిణామం చోటు– చేసుకున్న విషయం తెలిసిందే. కన్నప్ప చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన దృశ్యాలు, డేటా ఉన్న హార్డ్ డ్రైవ్ మాయం అయినట్లు– చిత్రబృందం తాజాగా వెల్లడిరచింది. దీనికి సంబంధించి ఇప్పటికే 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నిర్మాణ సంస్థ నమ్మక ద్రోహం కేసు కూడా నమోదు చేసింది. సినిమా ఎగ్జిక్యూటివ్ నిర్మాత రెడ్డి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఫిల్మ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలావుంటే మిస్ అయిన హార్డ్ డిస్క్‌కి సంబంధించి కీలక సమాచారం బయటపడిరది. ఈ హార్డ్ డిస్క్‌లో సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయని తెలుస్తోంది. దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు ఎటు–వంటి అధికారిక ప్రకటన చేయలేదు. 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ దాదాపు 30 నిమిషాల పాటు– కనిపించనున్నారని మంచు విష్ణు ఇటీ–వల వెల్లడిరచిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్ 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని, ఆయన స్క్రీన్–టైమ్ సినిమా కథను మలుపు తిప్పే విధంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతోంది. ముఖ్యంగా, మోహన్ బాబు, ప్రభాస్ మధ్య వచ్చే సన్నివేశాలు అత్యద్భుతంగా ఉంటాయని విష్ణు పేర్కొన్నారు. ప్రభాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు కూడా భారీ అంచనాలు పెట్టు–కున్నారు. ఈ నేపథ్యంలో హార్డ్ డిస్క్ మాయం కావడంతో చిత్ర యూనిట్ తీవ్ర ఆందోళనలో ఉంది. హార్డ్ డిస్క్ బ్యాకప్ పెట్టు–కున్న కూడా.. ఎవరైనా ఆన్‌లైన్‌లో లీక్ చేస్తే.. ఎలా అని చిత్రబృందం ఆందోళన పడుతుంది.




# షష్టిపూర్తి ఓ ఫ్యామిలీ డ్రామా

### దర్శకుడు పవన్ ప్రభ వెల్లడి

డా. రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు పవన్ ప్రభ మూవీ విశేషాలను మీడియాకు వివరించారు. షష్టిపూర్తి' గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా గారు కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా గారు ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండేవారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు– అడ్జస్ట్ అవ్వాలి. షూటింగ్‌కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే 'షష్టిపూర్తి'ని తీశాను. షష్టిపూర్తి' విషయంలో నేను ముందు నుంచీ చాలా క్లారిటీతో ఉన్నాను. రాజేంద్ర ప్రసాద్ గారు, అర్చన గారిని నేను మళ్లీ రెండో టేక్ అని అడగాలంటే ఎంత ధైర్యం కావాలి. ఎందుకు అని వారు ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పేలా, క్లారిటీ– ఇచ్చే స్థాయిలో నేను ప్రిపేర్ అవ్వాలి. అసలు వాళ్లు ఎలా చేయాలో చెప్పే స్థాయిలో నేను ఉండాలి. వాళ్లని యంగ్ లుక్‌లోకి తీసుకెళ్లి.. మళ్లీ ఓల్డ్ లుక్‌లోకి తీసుకు వచ్చాను. ఓ స్టిక్ట్ మదర్ ఎలా ఉంటారో అలానే చూపించాను. ఓ జోవియల్ ఫాదర్ ఎలా ఉండాలో అలా రాజేంద్ర ప్రసాద్ గారిని చూపించాను. పాటల సిట్యువేషన్‌ను తీసేసి కథను చెప్పమని ఇళయరాజా గారు అన్నారు. ఎక్కడ పాట రావాలో నేను చెబుతాను అని ఆయనే చెప్పారు. ఇక ఫస్ట్ కంపోజిషన్ కోసం మళ్లీ వెళ్లాం. సిట్యువేషన్ చెప్పిన వెంటనే హార్మోనియం మీద పల్లవి ప్లే చేసి వినిపించారు. 'ఇది సరిపోతుందా? మీరు ఆశించినట్టుగా ఉందా? ఇంకా ఏమైనా –చేద్దామా?' అని ఇళయరాజా గారు అన్నారు. ప్రతీ పాటకు మాకు ఎన్నో ఆప్షన్స్ ఇచ్చారు. అన్ని పాటల్ని క్షణాల్లో కంపోజ్ చేసి ఇచ్చారు. చైతన్య ప్రసాద్ , రెహమాన్ , కీరవాణి ఈ చిత్రానికి మంచి పాటలు రాశారు. రూపేశ్, ఆకాంక్ష ఇద్దరూ అద్భుతంగా నటించారు. రూపేశ్ కారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉంటాయి. ఆకాంక్ష అచ్చమైన తెలుగమ్మాయి పాత్రలో కనిపిస్తారు. ఆమె పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తరువాత ఆమెకు మరింత మంచి భవిష్యత్తు ఉంటుంది. 'షష్టిపూర్తి' అనేది పూర్తిగా కల్పిత చిత్రమే. ఇందులో ఉండే పాత్రల్లా బయట బతకలేరు. రాజేంద్ర ప్రసాద్ గారు పోషించిన పాత్ర బయట కనిపించదు. ఇలాంటి కథను నమ్మి పెట్టుబడి పెట్టడం అంటే మామూలు విషయం కాదు. మనం కథను చెప్పేటప్పుడు.. మనం ఏం ఫీల్ అవుతామో.. అవతల ఉన్న నిర్మాత కూడా అదే ఫీల్ అయితే సినిమా ముందుకు వస్తుంది. ఇలాంటి చిత్రాల్ని డైరెక్ట్ చేయడం కంటే ప్రొడ్యూస్ చేయడం కష్టం. మంచి ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాగా మా 'షష్టిపూర్తి' రాబోతోంది. కొన్ని రోజుల పాటు– ఈ చిత్రం అందరినీ వెంటాడుతూ ఉంటుంది. నా చిత్రం పెరుగన్నం లాంటిది. సెన్సార్ వాళ్లు మా చిత్రానికి ఒక్క కట్ కూడా చెప్పలేదు.





# ప్రజా సంక్షేమానికి సీఎం పెద్దపీట

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి
- ఒక్క ఏడాదిలోనే రూ.800 కోట్ల పనులు ప్రారంభం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** ప్రజా సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గత 20ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఒక్క ఏడాదిలోనే రూ.800 కోట్లు తీసుకువచ్చి పనులు ప్రారంభించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్, చిల్పూర్, జఫర్ గడ్ మండలాలకు సంబంధించిన 68మంది లబ్ధిదారులకు రూ.32,82,500 విలువ కలిగిన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత 20ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మన ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. దేవాదుల ద్వారా ప్రతీ ఎకరానికి గోదావరి జలాలు అందించేందుకు కాలువల అభివృద్ధి, 100పడకల అస్పత్రి నిర్మాణం, డిగ్రీ కాలేజీ నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి వెంట సర్వీస్ రోడ్ల నిర్మాణం, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ల నిర్మాణం, అప్రోచ్ రోడ్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రిని, సంబంధిత శాఖ అధికారులను అనేక సార్లు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలో అవసరమైన చోట అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ కమ్యూనిటీ హాల్లు, సెంట్రల్ లైటింగ్, రోడ్ల నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్ లో ఉన్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ఎవరెన్ని రకాలుగా మాట్లాడిన ఎవరు ఎం చేస్తున్నారనేది ప్రజలకు తెలుసని, మాకున్న ఏకైక ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..**

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్త శుద్ధితో పని చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, వేలేరు, కాజీపేట మండలాలకు సంబందించిన 18మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.18,02,088 విలువగల చెక్కులను, ధర్మసాగర్, వేలేరు మండలాలకు సంబదించిన 32మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.12,75,500 విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యూలర్ ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలు

- జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న
- నోటిఫికేషన్ విడుదల

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో రెగ్యూలర్ ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశం పొందడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పలు పీజీ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా వరంగల్ ప్రాంగణంలోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2025-2026 విద్యాసంవత్సరానికి ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశం పొందడానికి ఆసక్తి గల అభ్యర్థులు తెలుగు విశ్వవిద్యాలయం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలు WWW.teluguuniversity.ac.in, WWW.pstucet.org వెబ్ సైట్ లో ఉంచినట్లు వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను 24 జూన్ 2025 లోగా సాధారణ రుసుముతో, 30జూన్ 2026 వరకు ఆలస్య రుసుముతో సమర్పించాలని తెలిపారు. వివరాల కోసం 9989417299, 9989139136 సెల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని గడ్డం వెంకన్న తెలిపారు.

## ఎంసీపీఐ (యూ) కుల్దీప్ సింగ్ పార్టీలో చీలిక

- అందుకే వెంకట్ రెడ్డి, చందర్ రావు ఆధ్వర్యంలో మరో ఎంసీపీఐ ఏర్పాటు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ మధ్య కాలంలో ఎంసీపీఐ (యూ) లో కుల్దీప్ సింగ్ కార్యదర్శిగా మర్రెడ్డి వెంకటరెడ్డి, మోర్తాల చందర్ రావు, లింగంపల్లి, శ్రీనువాస్ రెడ్డిలు పోటీ వర్గంగా ఏర్పడి అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాలు చేశారు. జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తించి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మద్ది కాయల ఓంకార్ నిర్మాణం చేసిన పార్టీకి జాతీయ కార్యదర్శిగా పని చేసిన ఎండీ గౌస్ కరోనా సమయంలో అనారోగ్యంతో మరణించారు. వారి స్థానంలో మద్ది కాయల ఓంకార్ తనయుడు అశోక్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ దేశ వ్యాప్తంగా పర్యటించి కమ్యూనిస్టులను ఏకం చేసేందుకు కృషి చేస్తున్నారు. గత నవంబర్ లో దేశవ్యాప్తంగా పదిహేను కమ్యూనిస్టు పార్టీలతో హైదరాబాద్ లో జాతీయ సదస్సు కూడా నిర్వహించారు. ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలు పేరుతో ఘనంగా మే 12 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కమ్యూనిస్టు పార్టీలను ఒకే వేదికపైకి తెచ్చారు. ఇదే ఒరవడితో వివిధ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ మధ్యకాలంలో ఎంసీపీఐ (యూ) లో ఉన్న భిన్నాభిప్రాయాలు, విబేధాలు పార్టీలో చీలికతో వేరు వేరుగా కొనసాగెంత లేవని గ్రహించి రాజస్థాన్ లో మద్ది కాయల అశోక్, కుల్దీప్ సింగ్ ఉభయులు సమావేశం జరిపి ఒకే నిర్మాణంతో ముందుకు వెళ్ళాలని నిర్ణయించారు. మద్ది కాయల అశోక్ నాయకత్వంలో దేశంలో ఆర్ఎంపీఐ – ఎంసీపీఐ (యూ) లు కలిసి కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీగా ఏర్పడటమే కాకుండా ఇంకా కొన్ని కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరుపుతున్నారు.

## భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర చాలా కీలకమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో లైసెన్స్ సర్వేయర్లకు సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజు భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో ఆరు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నోటిఫికేషన్ జారీ చేసి, వారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాలో 315 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు సోమవారం నుంచి 50 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అనుభజ్ఞులైన రిటైర్డ్ సర్వేయర్లు థియరీతో పాటు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారినే సర్వేయర్లుగా నియమిస్తామన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం ఎంపిక చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అభ్యర్థులకు శిక్షణ మెటీరియల్ కిట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, పర్యవేక్షకులు అబూతల్హా, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గౌరవెల్లి ప్రాజెక్ట్, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గౌరవెల్లి ప్రాజెక్ట్, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హై వే భూసేకరణ ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గౌరవెల్లి ప్రాజెక్టు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ గురించి హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, పరకాల నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ ప్రక్రియ పురోగతిపై పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈ చైతన్య, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు విజయ లక్ష్మీ, జ్యోతివరలక్ష్మి దేవి, జగన్ మోహన్ రెడ్డి, బావ్ సింగ్, సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com